# అప్పిచ్చువాడు వైద్యుడు

చిన్నప్పుడు మాష్టర్లు వేమన పద్యాలు సుమతీ శతకాలు వల్లెవేయించేవారు. పద్యాలన్నీ కంఠతాపట్టి గడగడ అప్పచెప్పేయడం తప్ప భావం, తాత్పర్యం ఏమిటో అర్థంకాని వయసు అది – కాస్త జ్ఞానం తెలిశాక "అప్పిచ్చువాడు వైద్యుడు..." పద్యం చదువుతూంటే.. వైద్యుడు అప్పివ్వడం ఏమిటా అన్న ఆలోచన వచ్చింది... మాష్టరుగారిని తాత్పర్యం విప్పిచెప్పండని అడిగే వయసు, ధైర్యం వచ్చాక అడిగితే, అప్పుడాయన ఆ పద్యానికి అర్థం, తాత్పర్యం చెప్పాక...అప్పిచ్చువాడు వైద్యుడు అని గడగడ చదవడం తల్చుకుని నవ్వువచ్చింది – అయితే ఆ "అప్పిచ్చువాడు వైద్యుడు" అన్నది నిజం చేస్తూ ఓ వైద్యుడు కన్పించాడు చాలా రోజుల తరువాత.

ఆఫీసుకి వారంరోజులు శలవుపెట్టి పెద్దాపురం బస్సెక్కాను విశాఖపట్నం నించి. ఈ సారి తాడో పేడో తేల్చేసి ఆ వూర్లో వున్న తాతలనాటి భూములు అమ్మిపారేయాలని నిర్ణయానికి వచ్చాను – పిత్రార్జితం పదెకరాలనుంచి మాగాణి భూములు అమ్మితేమంచి ధర పలుకుతుంది. రైతు శిస్తు యివ్వక ధాన్యం యివ్వక నానా అల్లరి పెడ్తున్నాడు. వాళ్ల చుట్టూ తిరిగే ఓపికలేదు. అమ్మి డబ్బు బ్యాంకులో వేసుకుంటే వడ్డీ అన్నా వస్తుంది అనుకుంటే, ఆ రైతూ 'దున్నే వాడిదే భూమి' అన్న స్లోగను పట్టుకుని ఏభై ఏళ్ళుగా ఈ భూమి దున్నాను ఇది నాదే అని పట్టుక్కూర్చున్నాడు. ఓ బ్రోకరుని పట్టుకుని వాడితో మధ్యవర్తిత్వం జరిపించి ఆఖరికి ఓ ఎకరం, పాతికవేలు డబ్బు వాడికిచ్చి వదుల్చుకోడానికి తాతలు దిగి వాచ్చారు. ఆ బ్రోకరు నాలుగురోజుల క్రిందట ఇద్దరు కష్టమర్లుని కుదిర్చాను, బేరం నచ్చితే అమ్మొచ్చు, మీరురండి అని రాయడంతో యీ ప్రయాణం కట్టాను –

యీ భూములు అమ్మి వచ్చే డబ్బు మీద మా అన్న తమ్ములం ముగ్గురూ గాలి మేడలు కట్టకపోయినా తలో కొంపన్న కట్టుకోవాలన్న ఆశతో ఉన్నాం -

పెద్దాపురంలో బస్సు ఆగేసరికి పదిన్నర అయింది - తిన్నగా బ్రోకరు యింటికీ బయలుదేరాను - పెద్దాపురం నా చిన్ననాటికీ యినాటికీ పెద్దగా మారిందేమో కనపడలేదు - ఎంతసేపూ సిటీలు పెరిగి కిక్కిరిసి పోతున్నాయి తప్ప పల్లెటూర్లు ఏం పెరగకపోవడం అటుంచి, పల్లెల్లో వాళ్ళంతా పట్నాలకి తరలి వెళ్లడంతో మరింత ఖాళీ అవుతున్నయనిపిస్తూంది.

నేను వస్తున్నానని రాయడంతో బ్రోకర్లు యింట్లోనే వున్నారు - కాఫీ యిచ్చాక ఏ మాత్రం ధరలు పలికేది చెప్పాడు - ఆ ఇద్దరూ ఒకరు ఆ వూరి ఎమ్మెల్లే, రెండో ఆయన ఆ వూర్లోవున్న ఓ డాక్టరు కొనడానికి యింట్రస్ట్ చూపుతు న్నట్టు చెప్పాడు. - ఇద్దరినీ కల్సి మాట్లాడండి, మీకేది నచ్చితే ఆ బేరం సెటిల్ చేసుకోవచ్చు' అన్నాడు. యిద్దరం బయలు దేరి ముందు బసవరాజు ఎమ్మెల్లే దగ్గరకి, వెళ్ళాం ఆయన వీధివరండాలో పడక్కుర్చిలో పడుకుని 'ఈనాడు' చదువుతున్నడు. మనిషి ఆజానుబాహుడు, పెద్ద మీసాలతో.. ఎమ్మెల్యే నన్న దర్పంతో మాట్లాడాడు - 'ఈ వూళ్ళో తను తప్ప అంత మొత్తం యిచ్చి భూములు కొనే వాడెవడూ లేడన్నాడు అని చెప్పాడు... 'ఇంకో పార్టీ వుంది.. అక్కడ కూడా మాట్లాడి ఏ సంగతి చెప్తానని లేచాను - 'అతను ఆ మాట నచ్చనివాడిలా మొహం పెట్టాడు.

''ఏమిటాయన ఏదో నన్నే కొంటున్నట్లు పోజు యిస్తున్నాడు.. '' ఇంట్లోంచి బయటకొచ్చాక బ్రోకర్‌తో అన్నాను ఆయన మాటధోరణి నచ్చక -

''ఎమ్మెల్లేకదా, తనంతవాడులేడనుకుంటాడు లెండి'' - నవ్వాడు బ్రోకర్ -

తరువాత డాక్టరుగారి నర్సింగ్ హోమ్ కెళ్లాం - ఓ డాబా యిల్లది. డాక్టరుసూర్య ప్రకాష్.. ఎమ్.బి.బి.యస్... ఫిజిషియన్, జనరల్ ప్రాక్టిషనర్' అన్న బోర్డు చూసాను. సూర్యప్రకాష్.. కె. సూర్య ప్రకాష్ ఏదో విన్నపేరులా వుందని పించింది - ముందు వరండాలో కనీసం ఓ పాతికమంది ఆడ మగ కూర్చున్నారు... లోపలగదిలో డాక్టరు వున్నట్లున్నారు. ఓ యిద్దరు ముగ్గురు మనుష్యులు కుర్చీల్లో కనిపించారు.. ఈ డాక్టరు బిజీ డాక్టరుగా వున్నాడనిపించింది - 'డాక్టరుగార్కి కన్పించి వస్తాను బిజీగా వున్నట్లున్నారు - ఎప్పుడు మాట్లాడుతారో...' అంటూ లోపలికెళ్ళాడు - 'డాక్టరుగారు మధ్యాహ్నం వంటిగంటకల్లా యింటికి లంచ్‌కి వస్తారట. అక్కడికి వస్తే మాట్లాడచ్చు అన్నారు - యిప్పుడు చాలా బిజిగా వున్నారు

పేషంట్లతో..' ''సరే పదండి, యిలోగా నేనూ ఏదన్నా హోటలు కెళ్లి భోంచేసి వస్తాను..''

''అబ్బే హోటలు కెందుకండి మా యింట్లో చెప్పాను, భోంచేద్దాం. అక్కడ.. అఫ్‌కోర్స్ మీకభ్యంతరం లేకపోతే.. యీ వూర్లో హోటళ్లు అంతలేవు...''

''పదండి మీ యింటికే వెడదాం - భోజనం పెడ్తానంటే అభ్యంతరం ఎందుకు''

ఇద్దరం భోంచేసి సరిగా వంటిగంటకల్లా డాక్టరుగారి యింటికి వెళ్లాం - వరండాలో కూచుని ఎదురుచూస్తూంటే స్కూటరు మీదనించి డాక్టరు దిగి వచ్చాడు. ఆ డాక్టరుని చూస్తే ఎక్కడో చూచిన మొహంలా అన్పించింది. కాని, సరిగా గుర్తు మాత్రం రాలేదు. అయన లోపలికొస్తూ నన్ను చూసి ఒక్కక్షణం ఆగిపోయాడు. అతని మొహం లోనూ కనపడ్డ సందేహం అతనూ నన్ను గుర్తుపట్టడానికి ప్రయత్ని స్తున్నట్టునిపించింది.

''యీయనేనండి రామకృష్ణగారు.. ఆ లాండ్ అమ్ముతారని చెప్పాగా-'' బ్రోకర్ పరిచయం చేశాడు.

''రామకృష్ణ.. హనుమంతరావు మాష్టారుగారు నీ నాన్నగారు కదూ...'' ''ఆ.. మీరు.. నీవు...సూర్యం కాదు....'' జ్ఞాపకం వచ్చి సంతోషంగా అన్నాను... సూర్యం, నేను యిక్కడే పెద్దాపురంలోనే పెరిగి పెద్దవాళ్లమయ్యాం. యిక్కడి హైస్కూల్లోనే చదివాం - తరువాత కాలేజి చదువుకి కాకినాడ వెళ్లి కల్సియింటర్ చదివాం 'పి.ఆర్' కాలేజిలో... ఆతరువాత ఎవరిదారి వారిదయింది. మా నాన్నగారు పోవడంతో, మా చదువులకోసం మేం కాకినాడ మకాం మార్చాం - సూర్యం తండ్రి లాయరు. సూర్యం రెండో కొడుకు. నేను ఇంజనీరింగుకి వెడితే, సూర్యం మెడిసన్‌కి కర్నాటకలో డొనేషన్ యిచ్చి జాయిన్ అవడం వరకు తెలుసు.. తరువాత ఎవరి దారులు వారివయి.. ఈనాడు యిలా చూశాను సూర్యాన్ని...

''అరే, రామకృష్ణ, నువ్వా''... మొహం యింత చేసుకు అన్నాడు. సూర్యం - ''రా రా.. ఎన్నాళ్లయింది నిన్ను చూసి, ఈ లాండ్ నీదా, నాకు తెలియనే తెలియదు'' అంటూ సంతోషంగా భుజం చుట్టూ చెయ్యివేసి లోపలికి లాక్కెళ్లాడు.. పల్లెటూరిలో యిల్లయినా లోపలంతా ఆధునికంగా సోఫా సెట్లు, టి.వి, ఫ్రిజు వగైరా వగైరాలన్నీ వున్నాయి. - షెడ్డులో కారుంది. యివన్నీ చూస్తే వాడి ప్రాక్టీసు బాగున్నట్టే కన్పించింది. ''సరోజా.. చూడు.. వీడు నా చిన్ననాటి ఫ్రెండు...

రామకృష్ణ, యీ వూర్లోనే చదువుకున్నాం కల్సి - '' అంటూ భార్యని పిలిచి పరిచయం చేశాడు..

''మీరిద్దరూ ఫ్రెండ్సు అన్నమాట. అయితే మరినా మధ్యవర్తిత్వం ఎందుకు లెండి, మీరు మాట్లాడుకోండి'' బ్రోకరు అన్నాడు.

''థ్యాంక్స్ అండి.. మీ సహాయం లేకపోతేఆ రైతు లొంగేవాడు కాదు. నేను వీడితో మాట్లాడి మళ్లీ ఏ సంగతి చెపుతాను. మీ సహాయానికి మీ పర్సంటేజ్ మీకు ముడ్తుంది'' అని చెప్పి బ్రోకర్ని పంపించేశాను.

వాడు లంచ్ తింటూంటే, నేను కాఫీ త్రాగుతూ చిన్నప్పటి సంగతులన్నీ ఆరాటంగా చెప్పేసుకున్నాం. సరోజ నవ్వుతూ. ''అన్నీ యిప్పుడే మాట్లాడేసుకోవాలా.. అన్నయ్యగారు ఈ రోజుకి వుంటారులెండి, భోజనం చెయ్యండి ముందు'' అంది...

అరోజు రాత్రి కూర్చుని లాండ్ విషయం తేల్చేసుకున్నాం. నా ఫ్రెండుకి యివ్వకుండా ఆ ఎమ్మెల్లేకి యిచ్చే ఉద్దేశం లేదని బ్రోకర్‌కి చెప్పాను.

మా యిద్దరి బేరం సెటిల్ అయింది. అడ్వాన్స్‌గా చెక్కిచ్చాడు. మిగతా రాత కోతలు, రిజిస్ట్రేషన్ వగైరాలు వాడు నెలరోజులకి డబ్బు సమకూర్చున్నాక వచ్చి సంతకం చేసేట్టు నిర్ణయించాం.

''నీ అర్జన చాలా బాగుంన్నట్లుందే.. యింతడబ్బు పెట్టి లాండ్ కొనడానికి సిద్ధపడ్తున్నావు. యీ యిల్లు.. యిదంతా. ప్రాక్టీసు బాగున్నట్లుందే.. ఇంత పల్లెటూరికి యింత సంపాదన.. మీ డాక్టర్ల పని బాగుంది. మాకేం వుంది. కడిగేసిన జీతం రాళ్ళు తప్ప..'' స్నేహితుడి ఉన్నతికి సంతోషిస్తూనే నా పరిస్థితి చెప్పుకున్నాను.

''అంత సులువుగా అనేయకు నాయనా - నే పడ్డ బాధలు నీకేం తెలుసు? ఈనాడు యీ పోజిషన్‌కి రావడానికి పదిహేనేళ్ళు పట్టింది. యిలా నాలుగు రాళ్లు వెనకేసుకోవడం నాలుగైదు ఏళ్లనించే - అంతకు ముందు నా పాట్లు నీకేం తెలుసు, మొదటి మూడు నాగుగేళ్లయితే అయాకి డబ్బు ఇవ్వడాని కూడా సరిపోయేది కాదు సంపాదన - '' ఆదోలా నవ్వుతూ అన్నాడు.

'అ రోజులు తల్చుకుంటే భయం వేస్తుంది. ఓ నాలుగైదేళ్లు మేం పడ్డపాట్లు ఎవరూ పడుండరన్నయ్యగారూ యీ డాక్టరు కాక ఏ మామూలు

డిగ్రీ వున్నా ఏదో ఉద్యోగం చేసుకునే వారుగదా అనుకున్న రోజులు ఎన్నో.. తిండి గడువడమే కష్టమయ్యేది.'

''అదేంటి.. బోర్డు పెడితే మీ డాక్టర్లు సంపాదించని వాళ్లెవరు.. అందులో యిలాంటి వూర్లలో అట్టేమంది డాక్టర్లుండరుగదా...''

ఆ తర్వాత సూర్యం వాడిపాట్లు చెప్పుకొచ్చాడు. ''ఎమ్. బి. బి. యస్. అయ్యాక ఏణ్ణర్థం వరకు ఏ ఉద్యోగం దొరకలేదు - ప్రైవేటు ప్రాక్టీసు పెట్టాలంటే స్తోమత లేదు, పైగా వీధికి అరడజను మంది డాక్టర్లున్న చోట నాలాంటి కొత్త వాడి మొహం ఎవరు చూస్తారన్న సందేహం వున్నా ధైర్యం చేసి ఓ షెడ్డు అద్దెకు తీసుకుని బోర్డు పెట్టాను. నెలకి వంద రూపాయలన్నా సంపాదన లేదు. ఆఖరికి నర్సుల కిచ్చే జీతమంత తీసుకుని యిద్దరు ప్రైవేటు డాక్టర్ల దగ్గర అసిస్టెంటుగా చేరి ఓ ఏడాది గడిపాను. పోస్టుగ్రాడ్యుయేటు సీటు దొరకలేదు-అది లేనిదే ప్రైవేటు ప్రాక్టీసు డాక్టరు మోహం జనం చూడడం మానేశారు. ఓ మూడేళ్లు అడ్డమైన గడ్డి కరిచినా రోజులు వెళ్ళదీయలేకపోయాను.. ఇంక పట్టణాల్లో లాభం లేదని ఏ పల్లెటూరో వెళ్లి ప్రాక్టీసు పెట్టాలని నిర్ణయించుకున్నాను. చిన్నచిన్న వూర్లో కూడా ఒకరు యిద్దరు డాక్టర్లున్నారు - నాలుగైదు వూర్లు వెళ్లి చూసి వచ్చి అఖరికి యీ పుట్టి పెరిగిన వూరే నిర్ణయించుకున్నాను. నే వచ్చేటప్పటికి యీ వూర్లో గవర్నమెంటు ఆస్పత్రి పేరుకి మాత్రమే. మందులుంటే డాక్టర్లు లేక, డాక్టరుంటే మందులు లేక నామమాత్రంగా వుంది. ఓ ప్రైవేటు ఎల్.ఎమ్.పి. డాక్టరు ముసలాయన ఒకరుండేవారు. ఆయనకి పక్షవాతం వచ్చి ప్రాక్టీసు మానాడు. యింకో కుర్రాడు కొత్తగా ప్యాసయి నాలాగే ఎక్కడా చెలామణి కాక రెండు నెలల క్రితం వచ్చి బోర్డు పెట్టాడు.'' ఈ వూరికి వస్తారా, భలేవారే, బోర్డు పెట్టిన రెండునెలలకి ఐదువందలొచ్చింది.. మీరు యిక్కడ పెట్టారంటే బాధ పడతారు తరువాత' అంటూ చాలా డిస్కరేజ్ చేశాడు. నేను తనకి కాంపిటేషన్ అవుతానని. కాని, నాకు మరో గత్యంతరంలేక ఇక్కడే పెట్టాను ప్రాక్టీసు.

''అన్నయ్యగారూ... పెళ్లిలో నాకు మావాళ్లు పెట్టిన నాలుగు పేటల చంద్రహారం ఒక్కటే మాకాధారం ఆనాడు. అది అమ్ముకుని వచ్చిన డబ్బుతో ప్రాక్టీసు పెట్టడానికి కావాల్సిన ముఖ్యమైన సామానులు, నాలుగు కుర్చీలు, రెండు బల్లలు, టేబుల్స్, వైద్యానికి కావాల్సిన ముఖ్యపరికరాలు అన్నీ కొనుక్కున్నాక చేతిలో మిగిలిన ఐదువేలు తిండి గడపడానికి అట్టే పెట్టుకుని బోర్డుపెట్టారు ఆయన - ''

''అవునురా, ఆ రోజుల్లో నేపడిన ఆరాటం, అవస్థ తల్చుకుంటే నవ్వు, ఏడుపూ వస్తాయి - గుమ్మానికి ఎదురుగా టేబులు కుర్చీ వేసుకునిన దారిన పోయే వాళ్లల్లో ఎవరన్నా యిటు ముఖం తిప్పి చూస్తే వస్తున్నారన్న ఆశతో, ఆరాటంతో గుండెలు దడ దడ కొట్టుకొనేవి, వాళ్లు మరి రెండు అడుగులు అటు వేయగానే నిరాశతో గుండె జారిపోయేది. ఎవడన్నా లోపలికి వస్తే దేముడే దిగి వచ్చినంత ఆనందం కలిగేది''.

''మరి.. అఖరికి ఎలా సాధించావు యిదంతా'' అలశ్యం, సస్పెన్సు భరించలేక మధ్యలోనే అడ్డాను - సూర్యం భార్యవంక కొంటెగా చూసి నవ్వాడు. ''ఎలాగా.. నీవు చిన్నప్పుడు 'అప్పిచ్చువాడు వైద్యుడు' పద్యం చదివావా అదిగో, అలా అప్పిచ్చు వాడు వైద్యుడునయి, క్రమంగా పాపులర్ అయ్యాను.''

అర్థంకాక తెల్లపోయాను. ''అప్పు ఇవ్వటం ఏమిటి, వడ్డీ వ్యాపారం చేశావా-''

''అలాంటిదే అనుకో, మరి ఏం చెయ్యమంటావు. ప్రాక్టీసు పెట్టిన మొదటి నెలలో నా దగ్గిర కొచ్చిన వాళ్లెంత మందో తెలుసా, ఏడుగురు - ఆ ఏడుగురూ తిండికీ గతిలేని వాళ్లలాగే కనపడ్డారు. వాళ్ళిచ్చింది నాకు మొత్తం ముప్పైరూపాయలు - వాళ్లేఎందుకొచ్చారంటావు, ఆ కుర్రడాక్టరు కంటే నేనేమన్నా చవగ్గా యింజక్షను చేస్తానేమోనని వచ్చిన వాళ్ళు - అ,దులో ఒక పేషంటు అపెండి సైటిస్ అపరేషన్ అత్యవసరం అని చెప్పి నా దగ్గర చేసే సదుపాయం లేక కాకినాడ ఆస్పత్రికి తీసికెళ్లమన్నాను. యింజక్షన్ చేయించుకుని రెండు రూపాయలు టేబిల్ మీద పెట్టారు - ఒక నెల యీ వ్యవహారం చూసి ఆ వూర్లో నే నిలదొక్కుకోవాలంటే నా చదువు ఒక్కటే చాలదు. ప్రజలు నాదగ్గరకి రావలంటే వాళ్లని అకర్షించే ప్రత్యేకత ఏదో నా కుండాలని ఏం చెయ్యాలా అని అలోచించాను - ''

''అప్పుడు నేనే అన్నాను, ఎలాగూ ఏం డబ్బూ రాలేదు. ఆ ముప్పై నలభై రూపాయలు సంపాదన కంటే వూరికే కొన్నాళ్లు వైద్యం చేస్తే కనీసం పేరొచ్చాకన్నా రోగులు రావడం ఆరంభిస్తారని నేనే చెప్పాను. డబ్బు ఇవ్వక్కరలేదు అనగానే బీద బిక్కి ఆట్రాక్ట్ అవుతారుగదా, ఓ నెల రెండ నెలలు అలా చేసి చూడమన్నాను'' సరోజ అంది.

''వూరికే వైద్య చేయడమేగాదు, వాళ్లకి మందులూ కొన్నాళ్లు ఫ్రీగా యివ్వాల్సి వచ్చింది అనుకో.. ముఖ్యమన మందులు కొని వుంచి బీదవిరికి ధర్మాసుపత్రిలా

మందులు సరఫరా చేశాను. ఓ రోజు ఓ ముసలి పేషంటు వచ్చాడు. తెగ దగ్గు, కఫం - జ్వరం వదలడం లేదు - చూడగానే నిమ్మోనియా అని అర్థం అయింది. ఖరీదయిన ఏంటిబయాటిక్స్ వాడాలి - వాడు పాపంబీద సాలెవాడు. 'అంత ఖరీదు బిళ్ళలు నేనేమి మింగగలను బాబూ, ఏదో రంగు నీళ్లిప్పించండి దయుంచి' అని కాళ్ల పట్టుకున్నాడు - ఆ మందులు నా దగ్గరాలేవు. కొనాల్సిందే - ఓ కోర్సుకి సరిపడా కొనాలన్నా వందకి తగ్గదు. అలోచించి ప్రిస్క్రిప్షన్ తో పాటు వందరూపాయలు యిచ్చాను. 'ఈ మందులు షాపులో కొని వాడు, కాకపోతే రోగం తగ్గదు' అన్నాను. వాడు నమ్మలేనట్టు చూశాడు. ''ఇవి నా దగ్గర లేవు. ఇదిగో యీ డబ్బు అందుకోసమే యిస్తున్నాను తీసుకో'' అన్నాను. అప్పుడు వాడి మొహంలో కనపడిన భావం చూశాను. కన్నీళ్ళు కార్చాడు. కాళ్ళు పట్టుకున్నాడు. దేముడు అన్నాడు ఆ తర్వాత యీ కబురు పాకి బీదా బిక్కి రావటం అరంభించారు. మందులకి డబ్బులేక, ధర్మాసుపత్రి యిచ్చే మందులతో రోగం తగ్గని వాళ్లు.. జనం రావటం ఆరంభించారు. చిన్న చిన్న వాటికి నేనే మందులు యిచ్చేవాడిని, యిస్తూ చెప్పేవాడిని 'చూడండి, నాకూ యీ మందులూరికే రావటంలేదు. కొనే యిస్తున్నాను మీ మీద జాలితో, నేనేం దేముడిని కాను అలా గాలికి మందులు సృష్టించి యివ్వడానికి - మీ దగ్గిర డబ్బున్నప్పుడు నాకు తీసుకొచ్చి యివ్వండి, డబ్బులు కాకపోయినా ఏదయినా సరే' అని నోరిప్పి చెప్పేవాడిని. అలా అంటే కొందరు రైతులు, కూరలు.. ఒకళ్ళు పొలంలో పండాయని ఓ గుమ్మడికాయ, ఆనపకాయ, వంకాయలు, మా చెట్టువి అని అరడజను కొబ్బరి కాయలు, పనసపండు - మామిడి కాయలు - మా పొలంలోని అని అరమూట కందిపప్పు, మా అవుపాలతో వచ్చిన నెయ్యి - మా అవుపాలు అంటూ ఎవరికి తోచినవి వారిచ్చేవారు. కాస్త ఓ మాదిరి వాళ్ళు ఓ ఐదురూపాయలుటేబిలు మీద పెట్టేవారు. యిలా కొన్నాళ్ళు గడిచింది - నా అదృష్టం వల్ల 'యీ డాక్టరు దేముడిలా మనల్ని ఆదుకుంటున్నాడు, మంచి చెయ్యి రోగం తగ్గిపోతుంది' అన్న పేరు వచ్చింది.. జనం పెరిగారు - మరీ గతిలేని వాళ్ళకి మందులు కొనడానికి పదో పాతికో చేతిలో పెట్టేవాడిని మొదట్లో... 'ఇదిగో యీ డబ్బు అప్పుగా యిస్తున్నాను. మీ దగ్గరున్న ప్పుడు తెచ్చియివ్వాలి' అని చెప్పేవాడిని. పాపం ఆ బీద వాళ్ళు అవసరంలో అదుకున్నానన్న విశ్వాసంతో, వున్నప్పుడల్లా తలో పదో యిరవైయ్యో యిచ్చి అప్పు చెల్లగొట్టేవారు. యిలా ఓ ఏడాది గడిచింది. పేషంట్లు పెరిగారు. వాళ్ళకు నమ్మకం కల్గింది. నాకు పేరొచ్చింది. కాస్త వున్నవాళ్లదగ్గిర ఫీజు యిరవై, కాస్తంత తక్కువ వాళ్ల దగ్గిర పది, అసలు లేని వాళ్ల దగ్గిర ఐదుచొప్పున తీసుకుంటూ, వాళ్ళ

అవసరానికి వంద రెండు వందలు అప్పు యిస్తూ, మందులు యిస్తూ గడిపాను. రాబడి పెరిగింది - డబ్బుతో పాటు బియ్యం, పప్పులు వగైరా వస్తువులు దొరకడంతో కాస్త నిలదొక్కుకున్నాను. వున్న పేషంట్లు ఆ కుర్ర డాక్టరు దగ్గరకెవరూ వెళ్లకుండా నా దగ్గిరకే వచ్చేవారు. పాపం ఆ కుర్రడాక్టరు బోర్డు తీసేసి వూరొదిలి వెళ్లపోయాడు. ఆ వూర్లోనే కాక చుట్టపక్కల చిన్నచిన్న పల్లెలనించి జనం రావడం మొదలు పెట్టారు. ఆ వూర్లో వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు పెద్ద పెద్ద రోగాలకి, అపరేషన్లకి కాకినాడ వెళ్లినా మామూలు వాటికి నా దగ్గరకే రావడం ఆరంభించారు. చిన్న వూరవటంతో జనానికి నాపేరు బాగా తెలిసింది. నాకూ వూర్లో చిన్న, పెద్ద అందరూ పేరు పేరున తెలిసి అందరికీ ఫ్యామిలి డాక్టరు నయ్యాను. నర్సుల సహాయంతో ఫురుళ్లు మొదలు, వేసక్టమీలు, హైడ్రోసిల్స్ వగైరా చిన్న అపరేషన్లు మొదలు పెట్టాను. సామాగ్రి సమకూర్చుకుని రెండో ఏడు గడిచేసరికి యింక ఫరవాలేదు అనుకున్నాను.

''అప్పుడు యింక 'అప్పిచ్చువాడు వైద్యుడు' అవతారం చాలించండి, యిలా ఎన్నాళ్ళు యిస్తారు అన్నాను నేను'' సరోజ నవ్వింది.

''నిజమే - ఆ యిచ్చిన అప్పుల్లో కొన్ని తిరిగి వచ్చేవికావు - వంద తీసికెళ్లి పది యిరవై చొప్పున కాస్త తీర్చి మిగతాది ఎగనామం పెట్టేవారు. కాని ఒక్కసారిగా అలవాటు పడ్డ జనానికి మందులు, వాటికి డబ్బులివ్వడం మానేస్తే వాళ్లకి నా మీద నమ్మకం పోతుంది. అందుకని ఓ పథకం పెట్టాను.''

''ఏమిటది'' కుతూహలంగా అడిగాను.

''ఏంలేదు. డబ్బు అడిగిన వాళ్లకి 'చూడండి, మీలాంటి బీదవారికి, అడిగిన వారందరికీ యివ్వాలంటే, నాకూ బోలెడు ఖర్చు సంసారం, యీ అస్పత్రి వాళ్లకి జీతాలు, యివన్నీ చూస్తూ మీ అందరికి యివ్వాలంటే నాకూ కష్టమేగదా, ఇదిగో యీ 'హుండి' చూడండి యిది మీలాంటి బీదవారికి సహాయపడడానికే.. మీరు అప్పుగా తీసుకునే వందకి ఓ పది రూపాయలు దీన్లో వెయ్యాలి - అంతేగాక నా దగ్గరకొచ్చిన పేషంట్లు అంతలా రెండు రూపాయలు వేయండి. ఇందులో డబ్బు నే తీసుకోను. మీలాంటి బీదవారికి అవసరం వచ్చినప్పుడల్లా ఆదుకుంటుంది. ఇదిగో యీతాళం మీ దగ్గరే పెట్టుకోండి' అని చెప్పాను. ఆ మాట అందరికి నచ్చింది అంటే, నూటికి పదిరూపాయలు వడ్డీ పుచ్చుకున్నటూ అయింది. తలో రెండు చొప్పున ప్రతివాళ్ళు వేసే డబ్బు నిజంగానే పాపం బీదవాళ్లని ఆదుకోడానికి సరిపోయింది. యీపథకం బాగా ఫలించింది - ప్రతి వాళ్ళు హంతోషంగానే రెండు

రూపాయలు వేశారు. దాంతో బీదాబిక్కిని అదుకున్నావన్నా ఖ్యాతి దక్కింది, వాళ్ల అవసరమూ తీరింది. నా చేతి డబ్బు ఖర్చు పెట్టకుండా – క్రమంగా వాళ్ల రాబడిని బట్టి ఫీజులు పెంచాను. ఓ ఐదేళ్ళు గడిచేసరికి నిజంగా ఊపిరి సలపని బిజీ డాక్టరునయిపోయాను. పుణ్యాత్ముడు అన్న బిరుదుతోపాటు లక్ష్మీదేవి కటాక్షించింది. ఈ చుట్టు పక్కల వూర్లందరికి నేనే డాక్టరుని యిప్పుడు''.

''పోనిలే, పుణ్యం పురుషార్థం అన్నట్టు బీద జనాన్ని ఆదుకోవడానికి నీ ఆలోచన బాగానే వుంది – చాలా సంతోషంరా..'' అన్నాను.

''చూడు రామకృష్ణా, యీ లోకం వుంది చూడు – నీవు దాన్ని ఏమన్నా అడిగితే తాడెక్కి కూర్చుంటుంది. నీవు ఎవరినీ ఏం అడగకు, అన్నీ నీ కాళ్ల దగ్గిరకి వస్తాయి అని ఎవరో అన్నమాట నిజం. మనం అడిగితే పిల్లికి బిచ్చమేనా పెట్టని మనస్తత్వం మనిషిది. ఏమి అడగకుండా నీకు తోచిన సాయం చెయ్యి జనానికి – అప్పుడు జనమే నీ కాళ్ల దగ్గర అన్నీ పడేస్తారు. ఎటొచ్చీ వాళ్లకి ఆ నమ్మకం కలగడానికి సమయం పడ్తుంది. దానికి మనం నిలదొక్కుకోగలిగితే చాలు. జనాన్ని ఆకర్షించడానికి కొన్ని గిమ్మిక్కులు తప్పనిసరి – జనానికి విశ్వాసం కల్గి, తరువాత వాళ్ళు మనల్ని నమ్ముతారు అన్న సూత్రం నాకు బాగా ఉపయోగపడింది. పేద వాళ్లకి చాతనయిన సాయం చేస్తున్నాననే తృప్తితో పాటు నా బతుకు తెరువూ బాగుపడింది...'' నవ్వుతూ అన్నాడు.

''బాగానేవుంది నీకథ... పోనీలే, నీ వన్నట్టు నలుగురికి సాయపడితే వచ్చే తృప్తి వెలకట్టలేనిది. 'అప్పిచ్చువాడు వైద్యుడు' అన్న పదంకి అర్థం తెల్పిందిలే'' – నవ్వాను వాడూ శృతి కలిపాడు.

(పల్లకి వార పత్రిక – **1993**)

# మనిషి చేసిన దేముడు

అప్పటికి వారం రోజులనించి ఊర్లో కనపడడం లేదనుకున్న శంకరం ఊరి చివర పాడుబడ్డ శివాలయంలో కళ్ళు మూసుకుని కూర్చున్నాడని, పిలిస్తే పలకడం లేదన్న వార్త గొడ్లని కాచే కుర్రాడు పోలిగాడు వచ్చి చెప్పగానే, ఆవార్త ఊరిలో సంచలనాన్ని కలిగించింది.

సరిగా వారంనించి శంకరం వూళ్లో కనపడలేదు. మొదటిరోజంతా కొడుకు యింటికి భోజనానికికూడ రాకపోతే శంకరం తల్లి, కొడుకు ఏ స్నేహితులతోనో కలిసి ప్రక్కటౌన్‌కు వెళ్ళి వుంటాడనుకుంది. రెండో రోజు రాకపోతే ఆవిడ విసుక్కుంది. వెళ్ళే వాడు చెప్పి తగలడ గూడదా పూట పూటా వండి పారబోసుకుంటున్నాను అని చిరాకు పడింది. మూడో రోజు కూడా శంకరం యింటికి రాకపోయేసరికి కాంతమ్మ కాస్త కంగారు పడింది. ఎప్పుడన్నా ఎక్కడికన్నా వెడితే ఓ పూట, మహాఅయితే ఓక రోజుగాని యిలా చెప్పకుండా చెయ్యకుండా ఎప్పుడూ వెళ్ళలేదే అనుకొని గాభరాపడింది. "వాడే వస్తాడు. ఎక్కడికిపోతాడు. ఏ స్నేహితులో కనిపిస్తే పోయుంటాడు. పనీ పాటాలేదు. ఊరంతా బలాదూర్ తిరగడమేగా నీ కొడుకుపని, చిన్నవాడా చితకవాడా, వాడే వస్తాడు నీవెందుకు గాభరా పడ్తావు" అంటూ శాస్త్రిగారు భార్యని చివాట్లు పెట్టారు కొడుకుని తిట్టారు.

నాలుగోనాడూ శంకరం ఇంటికి రాకపోయేసరికి కాంతమ్మతోపాటు శాస్త్రిగారూ గాభరాపడ్డారు. ఏ సినిమాకో ప్రక్క టౌనుకీ స్నేహితులతో వెళ్ళడం అలవాటేగాని యిన్ని రోజులు ఏమయిపోయాడు. చెప్పకుండా ఎక్కడికి వెళ్ళివుంటాడు. భార్యాభర్తలు తర్జనలు పడ్డారు. శంకరం స్నేహితుల యిళ్ళకి వెళ్ళి వాకబుచేశారు శాస్త్రిగారు. ఎవరూ తెలీదన్నారు. అసలు చూడనేలేదు నాల్గు రోజులనించి అన్నారు.